సంకటి కట్టుకున్న సంగతి

సలికాలం సొచ్చిందంటే
ఇగం షురువైందంటే
ఇగ సగవెట్లుంటుండే...
మబ్బుల్నే లేసి సలిమంట కాగేతాన్కి
మక్కసొప్ప, నువ్వు కట్టె, కంది పొర్క,
వరి గడ్డి, సెక్కపొట్టు
సుదురాయించుకుంటుంటిమి...
గా సలి మంటనే నాకు దినాం
మబ్బుల లేసుడు నేర్పింది...

ఇప్పుడంటే తీరొక్క
గరపంగీలు తొడుక్కుంటున్నం...
అప్పుడు మా బాపు
పొద్దోతిని మడుతవెట్టి
సంకటి సేత్తుండే...
ముసి ముసి సీకట్లు వడంగ
సంకటి కట్టుకున్నమంటే
తెల్లారి ఎండెల్లే దాంక
ఇడకపోతుంటిమి...
గది మాకు ఇగవు సెగ
అంటకుంట ఎచ్చగుంచుతుండే...
పొద్దోతే గాదు
పాత సెద్దర్ల తోటి సుతం
సంకటి కట్టుకుంటుంటిమి...
ఇగ గొంగడి తోటైతే ఇంకా ఎచ్చగుంటుండే...

గప్పట్ల మా అందర్కీ గరపంగీలు
కొనాలంటే యాడైతుండే
గా సంకటే సక్కటి గరపంగి మాకు...
పిరపు గరపంగి కన్నా
పుకట్లనే తయారయ్యే
సంకటి కట్టుకొని
సంబుర పడుతుంటిమి...

గది నాకు లేకపాయే అని
మనాది పెట్టుకోకుంట
ఉన్నదాంతోటే తుర్తి పడి
సంబురాలకు పునాది ఎయ్యాలే...
సంకలమంటి సలినైనా
సంకటి ఆపినట్టు
అణికిచ్చే సలి అసుంటి
ఏ పాటి కట్టమొచ్చినా
ఎచ్చటి సంకటి అసుంటి
ఇకమతులుండనే ఉంటయి...
ధైర్యం సెడకుంట దారి నడాలే...

అల్లాడి శ్రీనివాస్
83416 63982

నిలిచి గెలిచిన మన భాష

'కొందరికి తెనుగు గణంబుగా, కొందరికి సంస్కృతంబుగా, నేనందరి మెప్పింతు కృత్యులనయ్యె యెడలన్..' – పోతన

పుస్తకాల్లోకి పనికి రాదన్నరు. నోరు తిరగడం లేదని మూతి తిప్పింగ్రు. కటిక వధ చేసినా కిక్కురమననివ్వలె. పల్లికిలించి పరాచికమాండింగ్రు. బఫూన్‌గాళ్లతో పలికిస్తూ భరించమన్నరు. అంటరానిదిగా చేసి అణిగుండమన్నరు.'ఆనిక్కాయ' అంటూ ఎగతాళి చేస్తే ఉడుక్కున్న వైచిత్రి. సొంత గడ్డపైనే పరాయిదంటే సర్దుకున్న దుస్థితి. ఇప్పుడు తలుగు తెంచుకున్న తెగువతనం ఇది. అసలుసిసలు భాషా మాతకే తల్లితనంగా మారింది.



మొదటి నుంచి ఉద్యమ పంథానే తెలంగాణది, 'భాషా దోషం'పై కూడా బహువిధాలుగా పోరాడిన చరిత్ర. తల్లి పొత్తిళ్లలో పరాయి బిడ్డగా మారిన దైన్యాన్ని ఎదుర్కొని, బరిగీసి తెగించి సాధించాల్సిన పరిస్థితి తనది. ఒక కడుపుల పుట్టినోళ్లు గుడా ఒక్కలాగుండరనే కనీస నీయతి మర్సి, 'ఆడి పెత్తందార్లు', 'ఇడి యాస'ను బక్కపల్చనిది చేసి బజార్న నిలబెట్టినా భరించింది. 'ఆనిక్కాయ' భాష అని అవమానపరుస్తుంటే అమ్మ కౌగిట్లోనే గొంతు పెకలని బిడ్డగా గమ్మున్నుండాల్సిన పరిస్థితి ఉండగా, 'అమ్మకపు' కొట్లలోని వారి వికృతపు 'సార'కాయ చెలరేగుతుంటే చూస్తుండిపాయె. ఇద్దరు బిడ్డల్లో స్వతహాగా 'సర్వ చందస్సోదహరణ వ్యాకరణాలున్న' ఐశ్వర్యాన్ని తరలివచ్చిన తెలుగుకు కట్టబెట్టి.., అభిమానం పొందిన బిడ్డను అనాథగా, లిపి కూడా లేని చిలిపిగా అభివర్ణించిన అవమానపు చాయలెన్నో. ముందొచ్చిన చెవులకంటే వెనుకొచ్చిన కొమ్ములు వాడి అన్నట్టుగా ఉమ్మడి పాలనలో ఈ తల్లి యాసను ఈసడించింగ్రు.., మాటతీరు వక్రీకరించింగ్రు.., పుస్తకాల్లో పొసగనిదని ముద్రేసి..,కార్యాలయాల్లోనైతే కనీసం ప్రవేశమే లేనట్టుగా చిత్రీకరించింగ్రు.

రుద్దుడును బల్మీటికి భరించిన నా తల్లి భాషకు వందనం. అన్నీ ఉన్నా నిన్ను ఎవరు లేనిదాన్ని చేస్తే తట్టుకున్న ధైర్యానికి అభివందనం. అరువై ఏండ్ల అణచివేతలో ఎన్ని భరించావో.., ఎన్నెన్ని దిగమింగావో. ఒంటినిండా బలమున్నా, ఆసరాలేని అనాథగా రోజులు లెక్కబెట్టి బిక్కుబిక్కున గడిపావ్. కళ్లముందటే 'గమ్మునుండవయ్యా' అని గొంతులు పిసుకుతున్నా భరిస్తూ మూలన నక్కితివి. డబ్బు యావ తప్ప మరేమీ లేని 'తెగబలిసిన గరీబు గాళ్లు' సైన్మాల్లో ఒకటి అర సందర్భాల్లో నీ ప్రయోగం చేస్తే ఎంత మురిస్తివి. గుడ్డిలో మెల్లలా తాకుతున్నారని సంబురపడ్తివి. పుట్టిన నేలపైనే పరాయిగా మారిన బాధను దిగమింగుతూ, ఉనికిని ప్రశ్నార్థకంగా మారుస్తున్న 'మూకలను' భరిస్తూ సాగిన సర్వ వ్యవహారీ సలాం నీకు.

తిరిగిన కాలం., వదిలిన మైకం. ఒక్కసారిగా వాళ్లు వీళ్లయ్యారు., వీళ్లు వాళ్లయ్యారు. ఆయన రాకతో యాసకే ప్రాస కూర్చి రాతలు మొదలుపెట్టారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమవేళ నీ యాసే శ్వాసగా, పలుకులే తేనెలుగా మార్చిన రోజులు ప్రపంచానికి కొత్త ఒరవడిని చూపిన దృశ్యాలు. అంతకాలం బిడియపడి మూలన నక్కిన నా తెలంగాణ పదాలన్నీ ఆయన నోటినుంచి మాటలుగా జాలువారుతుంటే శత్రువుల్లో బెరుకు మొదలయ్యే, పేపరోళ్లకు వణుకు షురువయ్యే. తొక్కిపెట్టిన తీరును తుడిచివేసేందుకు పడరాని పాట్లు మొదలువెట్టే. పదకోశాలు తెప్పించుకునే, హెడ్డింగుల్లో నిన్ను చొప్పించి ప్రజల్లోకి చొచ్చేందుకు వాళ్లు యత్నించే. ఒకటికి పదిసార్లు నీ యాసనే ఉచ్చరిస్తూ, పదికి వందసార్లు నీ సరళిలోనే సమస్యలను తెలియజేసేసరికి బలిమీటికి 'మనతో కలిసిన తెలుగు' భయకంపితమయ్యే.

'బెదిరించిన బరితెగింపు గాళ్లకు ఆయన' నోటి మాటలే సమాధానాలు కాగా, ఇక్కడి రాతలే శిలాశాసనాలయ్యాయి. తెలంగాణ సాహిత్యం ఇంత గొప్పదా అని పలు వేదికలపై ఆయన మునివేళ్లపై చదివిన పద్యాలు, పదాలతో కళ్లన్నీ తెరుచుకున్నాయి. రోజురోజుకు వేడెక్కిస్తున్న ఉద్యమంతో సిరా రంగు మారింది, రాత స్వభావం మార్చుకుంది. తప్పనిసరి పరిస్థితుల్లో కాగితంపై ముద్రణ మార్చాల్సి వచ్చింది.

రాష్ట్రం రావడానికి ముందు విద్యాసంస్థల్లో, పని ప్రదేశాల్లో (ఉద్యోగ స్థలాల్లో), ఆఖరికి ఆలయాల్లో కూడా పలకడానికి చిన్నచూపునకు గురైన పదాలు కేసీఆర్ 'ప్రత్యేక' నినాద రంగప్రవేశంతో తారుమారయ్యాయి. అవతలివారి తీరు మారింది. అధికారిక కార్యక్రమాల్లో, గల్లీ నుంచి ఢిల్లీ వరకు ప్రతి సభా, సమావేశాలు, భేటీలు ఏదైతేనేం తెలంగాణ పదాలతో ఆకట్టుకునేలా వివరించిన తీరే నా తెలంగాణ యాస పునర్జన్మకు మూలమైంది. లక్షల్లో హాజరైన జనాలను ఉద్దేశించి ఆయన చేసిన ప్రసంగాల్లో, కోట్లాదిగా ఉన్న యావత్ తెలుగు జాతికి చేసిన హితబోధలో కేసీఆర్ పదప్రయోగం కట్టిపడేసింది. ఒక్క దెబ్బకు వాళ్లంతా బోనాన్ని నెత్తికెత్తారు., బతుకమ్మను గుమ్మం దాటించారు.

నవ్వులాటలో తెలంగాణ యాసను ఇరికించి నిర్లక్ష్యంగా మలిచిన తీరు అవమానకరం. దానికి సైన్మాల్లో మత్తు మందిచ్చి పడుకోబెట్టారు.., అప్పుడప్పుడు అన్నట్టుగా బఫూన్ల తోనో.., ప్రతి నాయకుడి నోటితోనే పలికించి కించపరిచారు. 24 ఫ్రేమ్స్‌లో 14 రీళ్లు ఒక్కెత్తయితే, పొడిపొడిగా, యథాలాపనగా వచ్చిపోయే నీ యాస పడిన గోస వర్ణనాతీతం. అదీ నిన్నేదో ఉద్ధరించడానికి కాక నైజాం కలెక్షన్లు కొల్లగొట్టడానికే తప్ప మరోటి కాకపాయె.

వెటకారపు మాటలకు, కక్కొచ్చే రోతకు కేరాఫ్‌గా 'ఏంరో.. నేనైతే విలన్‌ను' మంచిచెడు మానం మర్యాద అస్సలు పట్టించుకోనోన్ని..' అనే బాపతు డైలాగులుగా బలవంతపు ప్రయోగాలు. ఇప్పుడు తెలంగాణ కథలతో, భాషతో సినిమాలు రావడం, హిట్లు కొట్టడం.. యావత్ సినీ పరిశ్రమను షేక్ చేస్తున్నాయి. అంతకన్నా ఇంకేం గావాలె.

ఏది ఏమైనా జీవి మనుగడకు మూలం భావ వ్యక్తీకరణ. సర్వకాలాల్లో సంబంధాలు సజీవాలుగా నిలిచేది భాషతోనే. మనుగడ కోసం జరిగే ప్రకృతి పోరాటంలో ప్రతి ప్రాణిది ఓ ప్రత్యేక శైలి. హావభావాలు వ్యక్తపర్చుకుంటూ.., కష్టసుఖాలు పంచుకుంటూ సాగడానికి ప్రతి ప్రాణికి ఓ భాష ఉంటుంది. మాటలు రాని జీవాలు సైగలతో సాగుతుంటే.., మాట్లాడే ఒకే ఒక ప్రాణి మనిషి మాటలతో వారధులను నిర్మించుకుంటాడు. ఎక్కడి భాష అక్కడిదే., ఎవరి ఒరవడి వారిదే. గెలిచి నిలిచిన తెలంగాణ యాసది అపార చరిత్ర. అమోఘ భవిత. ఘనకీర్తి ఎవరిదైనా కొలవాల్సిందే. అదే నేడు తెలంగాణలో అపార పారవశ్యంతో మెరుస్తూ, మురుస్తున్న నా తల్లి తెలంగాణ భాష. ముచ్చటగొలిపే పదప్రయోగంలో మైమరచిపోతూ పునీతమవుతున్న యాస. నిన్ను రాస్తే ఎంత హాయో.., నీ పలుకు వింటే ఎంత పారవశ్యమో. పాల కుండకు పట్టిన గేగు భాష.. ఉయ్యాల ఆటలో హుంకారపు శబ్దం తనంటా...

రాజేంద్రప్రసాద్ చేలిక
99858 35601

విక్రమార్కులు

మట్టిలో కలలు విత్తుకున్నా
మనసంతా నింగి మీదే
చుట్టం చూపుగా అయినా వచ్చిపోనీ
వాన కోసం ఎదురుచూసీ చూసి
కన్నీళ్లు కురుస్తాయి గానీ
మేఘం ఏ మాత్రం జాలి తలచదు

తడిలేని పంట ఎడారి
కరువు కాలానికి తోడు
పేగుల్ని తింటూ ఆకలి పుండు

రెండు ఎడ్లను నమ్ముకొని
నాలుగు కాళ్ల మెడకు నాగలిగట్టి
బతుకు తెరచాప ముందుకు నడిపిస్తూ
తలరాత మారిపోయే గీతలు ఏవో
మట్టి పలక మీద పచ్చటి చిత్రాలు గీస్తూ
రేపటి అన్నపు రాశుల కోసం
స్వేదజలం చల్లుతారు

బారసాల జరుగుతున్నట్టు పైరు పాపల
ఊయల పండుగ జరుపుతున్నట్టు
మొలక నవ్వులు నాటుతారు
కాలువ తల్లిని బతిమాలి
ఇన్ని నీళ్ళు సాయం కోరుతారు

కష్టం చూడలేక
అప్పు ఇచ్చిన షావుకారు లాగా
కరుణ గలిగిన ఋతువు
కొంత చినుకుపాట ఒలకబోసుకుంటుంది
పుష్కర స్నానం ఏదో పూర్తయినట్టు
కర్షక హృదయం సంబురమవుతుంది

కింద మీద పడి
కుందేలు మీద తాబేలు గెలిచినట్టు
పంట కోత కొస్తుంది
అలుకుజల్లుకొని కల్లాలు ముస్తాబవుతాయి

అప్పు వసూళ్లకు వచ్చిన సేటు లెక్క అవసరానికి
ఎంత పిలిచినా పలుకని వరుణ దేవుడు
విశ్వరూపం ప్రదర్శిస్తాడు

బాగుపడితే చూడలేని కుళ్లుబోతు కాలం
బోరు బోరున విలపిస్తుంది
చేతి కొచ్చిన పంట
నోటికి అందకుండా తన్నుకు పోతుంది
పంటంతా తొక్కి తొక్కి పాడుజేసిన
వాన రాక్షసి ముందు
గుండె దుఃఖ సాగరమవుతుంది
గాయం మానని గానమవుతుంది

పట్టువదలని విక్రమార్కులు
మళ్లీ మట్టిని ముద్దాడుతారు
ఆకాశానికి దండం పెడుతారు
బతుకు పాఠం చదువుతూ
కాల పరీక్షకు ఎదురు నిలబడుతారు.

గజ్జెల రామకృష్ణ
89774 12795

రసరమ్య లాహిరి నన్నయ్య కావ్యశైలి

ఆంధ్రసాహిత్యానికి అజరామరమైన సేవ చేసిన వాడు నన్నయ్య. విభిన్నమైన లిపిరూపాన్ని సంతరించుకున్న తెలుగువాఙ్మయచరిత్రను కొత్త పుంతలు తొక్కించిన వాడు నన్నయ. భారతీయ భాషలన్నీ హల్లుతో అంతమయ్యే భాషలు కాగా కేవలం ఒక్క తెలుగు భాష మాత్రమే అచ్చుతో అంతమయ్యే భాష. అందుకే తెలుగు భాషకు అజంత భాషగా పేరు వచ్చింది. 'నికోల్ కాంటే' అనే ఇటాలియన్ భాషావేత్త తెలుగు భాషను 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్' అని పేర్కొన్నాడు . అంతేకాకుండా ఇటీవల కాలంలో ప్రాచీనభాషాహోదాను పొందిన భాషల్లో సంస్కృతము, తమిళం తర్వాత తెలుగుభాషది మూడోస్థానం. అంతటి ప్రాచీన తెలుగుభాషలో ఉత్కృష్ట కావ్యాన్ని రచించిన నన్నయ యావత్తు తెలుగుజాతికి అభినందనీయుడు, వందనీయుడు.

పదకొండవ శతాబ్దంలో రాజరాజ నరేంద్రుని ఆస్థాన కవిగా బహుముఖ ప్రజ్ఞా పాటవాలను వెలయించిన నన్నయ, క్రీస్తుశకం 1022 నుంచి 1061 మధ్యకాలంలో జీవించినట్లుగా తెలుస్తుంది. నన్నయ తెలుగువాడు కాదని కన్నడిగుడు అనే ప్రచారం కూడా ఉన్నది. కానీ నన్నయకు తెలుగు భాష మీద ఉన్న పటుత్వము, అనేక శాసన ఆధారాలను పరిశీలిస్తే నన్నయ తెలుగు వాడేనని రూఢీ అవుతుంది.

ద్రవిడ భాషా కుటుంబానికి చెందిన ఆంధ్ర భాషకు అపారమైన సేవనందించినవాడు రాజరాజ నరేంద్రుడు. రాజమహేంద్రవరం రాజధానిగా 11వ శతాబ్దంలో ఆయన పరిపాలనలో ఉన్నదీ తెలుగుసీమ. రాజరాజే ఆంధ్ర మహాభారతాన్ని నన్నయచే రాయించినట్టు చారిత్రక ఆధారాలను బట్టి తెలుస్తున్నది. వాగనుశాసనుడు, విపుల శబ్దశాసనడు, ఆదికవి అన్న బిరుదులు కలిగిన నన్నయభట్టారకుడు 'ఆంధ్రశబ్దచింతామణి' అనే గ్రంథాన్ని తెలుగుకు మొదటి వ్యాకరణ గ్రంథంగా సంస్కృతంలోనే రాశాడు. 'చాముండికా విలాసము', 'ఇంద్ర విజయము' అనే కావ్యాలు కూడా నన్నయ రాసినట్టుగా తెలుస్తుంది. కానీ అవి ప్రస్తుతం అలభ్యం. మూడున్నర పర్వాల మహాభారతాన్ని ఆంధ్రీకరించిన నన్నయ్యకు రాజరాజ నరేంద్రుడే మొదటి శ్రోత. నారాయణభట్టు అను సహాధ్యాయి సహాయకారి.

మహాభారతము ఆంధ్రీకరణము పూర్తిగా స్వతంత్రానువాదమైనప్పటికీ ఆంధ్రమహాభారత ప్రారంభాన్ని మాత్రం సంస్కృత శ్లోకం తోనే ప్రారంభించాడు నన్నయ్య.

శ్లో : శ్రీ వాణీ గిరిజాశ్చిరాయ దధతో వక్షో ముఖాంగేశు యే
లోకానాం
స్థితి మావహన్త్య విహతాం స్త్రీపుంస యోగోద్భవాం
తే వేదత్రయ మూర్తయః త్రీ పురుషా సంపూజితావస్సురైః
భూయాసుః పురుషోత్తమాంబుజ భవశ్రీకంధరాశ్రేయసే !!

ఇది గీర్వాణ భాషాభిమానమై ఉండవచ్చును, లేదా భారతమును సంస్కృతంలో రాసిన వ్యాసునిపై భక్తి భావం కావచ్చును. భాషాభగవదత్తవాదమును అనుసరించి సకల భాషలకు మాతృక సంస్కృతము అనే భావమూ కావచ్చు. ఈ శ్లోకంలో సృష్టి స్థితి లయలకు కారణభూతులై త్రిమూర్త్యాత్మకము, త్రిగుణాత్మకమైన శ్రీ లక్ష్మీ సరస్వతి పార్వతులకు , బ్రహ్మ విష్ణు పరమేశ్వరులకు సవినయంగా నమస్కరించి కావ్య రచనకుపక్రమించాడు నన్నయ. ఆంధ్రమహాభారత తత్వాన్ని నన్నయ అవతారికలోనే పేర్కొన్నాడు.

సీ. ధర్మ తత్వజ్ఞులు ధర్మశాస్త్రంబని
ఆధ్యాత్మ విధులు వేదాంతమనియు
నీతి విచక్షణుల్ నీతిశాస్త్రంబని
కవి వృషభులు మహాకావ్యమనియు
లాక్షణికులు సర్వలక్షణ సంగ్రహమని
ఐతిహాసికులితిహాసమనియు
పరమ పౌరాణికులు బహుపురాణ స
ముచ్ఛయంబని మహి కొనియాడుచుండ

ధర్మ మార్గాన్ని కోరుకునే వారికి ధర్మశాస్త్రంగాను, ఆధ్యాత్మిక తత్వాన్ని తెలియగోరువారికి వేదాంతముగాను, నీతి విచక్షణ కావలసిన వారికి నీతి శాస్త్రముగాను, మహాకవులకు కావ్యరాజముగాను, కావ్య లక్షణ సమన్వయం కోరువారికి లక్షణశాస్త్రముగాను, ఇతిహాసముగా చదువుకునే వారికి ఇతిహాస కావ్యముగాను, పౌరాణికులకు పురాణముల సముదాయముగా ఎవరు ఏ విధముగా ఫలితమును ఆశించిన ఆ విధమైన ఫలితమును ఇచ్చేదిగా వేదవ్యాసుడు రచించిన మహాభారతము అపారమైన ఫలితాన్ని ఇస్తుంది అని నన్నయ వ్యాఖ్యానించాడు.

కవిత్వలక్షణాలను పరిశీలిస్తే తన రచనకు ప్రధానంగా మూడు లక్షణాలు ఉంటాయని నన్నయ్య స్వయంగా సూచించాడు. అందులో ఒకటి ప్రసన్న కథాకలితార్థయుక్తి, రెండవది అక్షర రమ్యత, మూడవది నానారుచిరార్థ సూక్తి నిధిత్వము.



నానా రుచిరార్థ సూక్తి నిధిత్వం

నన్నయ మహాభారత కావ్యరచనలో అనేక విధాలుగా పాఠకున్ని ప్రభావితం చేసేవి, ప్రజలకు రుచించేవి,అర్థవంతమైన సూక్తులతో కూడిన విషయాలను ఎన్నో ఉటంకించాడు. రుచిరార్థ సూక్తి అంటే పాఠకుని ప్రభావితునిగా చేసి, మనోవికాసాన్ని కలిగించేవి అని అర్థం. ఇలాంటి ఎన్నో సూక్తులతో కూడిన సందేశాలు ఆంధ్రమహాభారతంలో కనబడతాయి.

ఉ : సారమతిం కవీంద్రులు ప్రసన్న కథాకలితార్థయుక్తి లో
నారసి మేలునానితరు లక్షరరమ్యత నాదరింప నా
నారుచిరార్థసూక్తినిధి నన్నయ భట్టుతెనుంగునన్ మహా భారత
సంహితారచనబంధురుడయ్యెజగద్ధితంబుగన్!

విలక్షణమైన కావ్య లక్షణాలను ప్రతిక్షేపించి జగత్ప్రసిద్ధమైన కావ్య రచనకు పూనుకుంటానని ఆత్మవిశ్వాసాన్ని ప్రారంభంలోనే ప్రకటించాడు. నన్నయ చెప్పిన ఒక్కొక్క లక్షణాన్ని సునిశితంగా పరిశీలిస్తే కొన్ని మచ్చుతునకలు..

చం:నుతజల పూరితంబులగు నూతులు నూరిటికంటే సూనృతవ్రత!ఒక బావిమేలు మరి బావులు నూరిటికంటే ఒక్క సక్రతువదిమేలు తత్క్రతు శతకంబుకంటె సుతుండు మేలు తత్సుతశతకంబుకంటే నొకసూనృత వాక్యముమేలు సూడగన్ !

ఈ పద్యంలో నన్నయ సాధించిన అద్భుతమైన సూక్తి సత్య వాక్యము కంటే అపరమైనది మరొకటి లేదు అని. ఆలయములు , బావులు, ఉద్యానవనములు, పేదలను ఆదుకోవటం మొదలైనవి సప్తసంతానములుగా చెప్తారు. ఇవన్నీ ఇచ్చే ఫలితములు ఒక్కసత్య వాక్యమువలన కలుగుతాయి అని భవిష్యతరాలకు చక్కని సందేశాన్ని ఇచ్చాడు.

అక్షర రమ్యత :-

కావ్య రచనకు అక్షర రమ్యత అనేది ఒక విలక్షణ లక్షణం. రసరమ్యమైన అక్షరముల కూర్పు ఎక్కడ ఎప్పుడు ఎలా ఉపయోగించాలో తెలిసిన నేర్పరి నన్నయ. పాండవులలో అగ్రగణ్యుడు, ధర్మాత్ముడు అయిన యుధిష్ఠురుని పరిపాలన గురించి తెలియజేసే మదమాతంగ తురంగ కాంచన లసన్మాణిక్య గాణిక్య సంపద లోలింగొని వచ్చి అనే పద్యంలో చక్కని అక్షత రమ్యత్వాన్ని ప్రయోగించాడు నన్నయ్య.

ప్రసన్నకథాకలితార్థయుక్తి :-

నన్నయ్య కవితాలక్షణములలో సుకుమారమైనది సుందరమైనది ప్రసన్నకథాకలితార్థయుక్తి. కథాకథన విధానాన్ని బట్టి పాత్రలు, సన్నివేశములు సంఘటనలు కనుల ముందు ప్రత్యక్షమై పాఠకుని తదాత్మీకరణకు గురి చేయునట్లుగా చెప్పటమే ఈ లక్షణం.

లక్షణాలంకార వ్యాకరణఛందో లక్షణ సమన్వితమై, ప్రతిభా వ్యుత్పత్తి ప్రయోజన సహిత కావ్యరాజమై తెలుగు భాషకు తలమానికమైన ఆంధ్ర మహాభారత మహోత్కృష్ట గ్రంథమునందు నన్నయ అనుసరించిన సౌరభపద ప్రయోగము తర్వాత కాలంలో చాలామంది కవులు అనుసరించారు. తెలుగుభాషకు పరిపూర్ణమైన లిపి రూపొందక మునుపే రాయబడిన మహాకావ్యమైనప్పటికీ విశ్వనాథ సత్యనారాయణ పేర్కొన్నట్లు ఋషివంటి నన్నయభట్టారకుని కావ్య శైలి ఒక రసరమ్యలాహిరి. ఇది యదార్థం.

మహతితేజశ్రీ
76619 38945

పట్టు క(వి)త

అందమైన అతివను సృష్టించాక
అంతే గౌరవాన్ని ఆమెకు ప్రసాదించమని
పట్టు పట్టాడు బ్రహ్మనేత కళాకారునితో

ఒక యజ్ఞం మొదలైంది
మొదటి త్యాగం పట్టుది అయితే
తనవంతుగా జీవితాన్ని ధారపోశాడు నేతన్న

కలప పందిరి కింద ఒక తపస్సు
కాళ్లు చేతులు ఒక లయతో నాట్యం
చెమట చుక్కలు నిరంతరం తాళం
రంగుల కనికట్టు జరుగుతుందని తెలిసి
దేవతలు ముచ్చట పడి వచ్చి చూసిరి

దారాలు పెనవేసుకుని దడి కట్టి
దేహానికి రక్షణ కంచె కడుతుంది
జరీ అంచు దిష్టి తీసి
మగవాడి చూపులన్నింటినీ
పాదాల దగ్గర మోకరిల్ల జేస్తాయి

పండుగ ప్రతీక పట్టు మాత్రమే
చీర కట్టుతో సంప్రదాయం కొనసాగే
భారత దేశం సంస్కృతి నిలయంగా విలసిల్లె

మగువ మురిపాలు సింగార అలంకారాలు
ముగ్ధ మనోహర కంచి బనారస్ ఇక్కత్ చీరెలు వరాలు
పోచంపల్లి గద్వాల్ వుప్పాడ వెంకటగిరి తెలుగు పట్టు క్షేత్రాలు

మగ్గం ఉన్న ప్రతి ఇల్లు ఒక దేవాలయం
రాట్నం మంగళ హారతిలా నిత్య పూజా నిలయం
కడుపు నింపక పోయిన కళ కొనసాగించే గొప్ప సంకల్పం...

దాసరి మోహన్
99853 09080

సమాజ హితమే 'సాహిత్యం'

ఒక దేశ సంస్కృతి అక్కడి ప్రజల జీవన విధానాన్ని ప్రతిబింబిస్తుంది. ప్రభావితం చేస్తుంది. సంస్కృతిలో సాహిత్యం, కళలూ ప్రధాన భూమిక పోషిస్తాయి. ఇవి వ్యక్తుల మానసిక జగత్తుతో సంపర్కించి, వ్యక్తి చేతనను తీర్చిదిద్దడంలో దోహదపడతాయి.

ఒక కళాకారుడు తన చేతనతోనూ,బాహ్య జగత్తుతోనూ సంఘర్షించి, తనను తాను సంస్కరించుకున్నప్పుడే ఉత్తమ సృజన వెలువడుతుంది. అలా సృజింపబడ్డది ఆ ప్రజల సంస్కృతిని, సంస్కారాన్ని పరిపుష్టం చేస్తుంది. అందుకే కళాకారుడికి తన సృజన పట్ల గురుతర బాధ్యత ఉన్నది. సాహిత్యం సంస్కృతిలో భాగం గనుక, సాహితీకారులకు జీవితం పట్ల, తాము చేసే సృజన పట్ల బాధ్యత, నిబద్ధత చాలా అవశ్యకం. సాహిత్యం జీవితం విలువను తెలియజేయాలి. మానవ సంబంధాల పట్ల, జీవితం పట్ల సానుకూల దృక్పథం కలుగజేయాలి. ప్రేమ, జీవితం, సమాజం పట్ల గౌరవం కలిగించాలి. జీవితం ఎంత వేదనాభరితమో తెలియజేస్తూనే, జీవితం ఔన్నత్యాన్నీ, జీవితం విలువను ఎరుకపరచాలి. అప్పుడే వ్యక్తి జీవితాన్ని సమర్థవంతంగా గడపగలుగుతాడు. అందుకే సాహిత్యం సమాజం హితం కోరుతుందని అంటారు. అలా సాహిత్యకారుడు సాహిత్య విలువలను కాపాడినప్పుడే అతని సాహితీ వ్యాసంగానికి ఔచిత్యం,విలువ సిద్ధిస్తాయి. అదే అతని పరమ ధర్మం కూడా!

– దండమూడి శ్రీచరణ్

కలం పిలుపు

పురస్కారాల ప్రదానం

హరిదా రచయితల సంఘం ఆధ్వర్యంలో డిసెంబర్4న సరస్వతీరాజ్–హరిదా ప్రతిభామూర్తి పురస్కారాల ప్రదానోత్సవం నిజామాబాద్‌లోని నవ్యభారతి గ్లోబల్ స్కూల్‌లో జరుగుతుంది. ఘనపురం దేవేందర్ అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో ఆచార్య ఆర్.లింబాద్రి, అమృతలత, వి.శంకర్, క్యాతం సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొంటారు. అనంతరం రాష్ట్రస్థాయి కవి సమ్మేళనం నిర్వహిస్తారు.

-హరిదా రచయితల సంఘం

ఉగాది పోటీలు

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని షార్‌వాణి సాహిత్య పత్రిక వేముగంటి కృష్ణారావు, సీతారామం స్మారక ఉగాది పోటీలు నిర్వహిస్తున్నది. పద్యాలు, వచన కవితలు, కథల విభాగాల్లో ఈ పోటీలుంటాయి. అన్ని విభాగాల్లోనూ నగదు బహుమతులు ఉంటాయి. రచనలను జనవరి 31లోగా sharvaani1981@gmail.comకు మెయిల్ చేయాలి.

– షార్‌వాణి సాహిత్య పత్రిక